


ఇన్‌చార్జి డీఐఈవోగా మాధవి

మెదక్ అర్బన్, ఆగస్టు 27 : ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్(డీఐఈవో) ఇన్‌చార్జిగా మెదక్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మాధవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీఐఈవోగా పని చేసిన సత్యనారాయణ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో జిల్లాలో సీనియర్ ప్రిన్సిపాల్‌గా ఉన్న మాధవిని ఇన్‌చార్జి డీఐఈవోగా ఇంటర్ విద్యామండలి నియమించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ విద్య బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

సీజనల్ ముప్పు
వైద్యానికేది దిక్కు ?

సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. కలెక్టర్లు సైతం రంగంలోకి దిగి ఆస్పత్రులను సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీస్తున్నారు. వైరల్ ఫీవర్, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బారిన పడి ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరుగుతుంది. మరోపక్క ఆస్పత్రుల్లో అరకొర సిబ్బందితో వైద్య సేవలు అందక రోగులు అవస్థలు పడుతున్నారు. నర్సాపూర్, జహీరాబాద్‌లో పేరుకు వందపడకల ఆస్పత్రులున్నా వైద్యుల కొరత వేధిస్తోంది.

- జహీరాబాద్, నర్సాపూర్ ఏరియాస్పత్రుల్లో వైద్య సిబ్బంది కొరత
- నిత్యం పెరుగుతున్న రోగుల తాకిడి.. వైద్య సేవలందక అవస్థలు
- నర్సాపూర్ ఆస్పత్రిలో ఇద్దరే డ్యూటీ డాక్టర్‌లు.. రాత్రి వేళ అంతే సంగతి!

నర్సాపూర్/జహీరాబాద్, ఆగస్టు 27 : సాధారణ రోజుల్లోనే రోగుల తాకిడి ఎక్కువగా ఉండే జహీరాబాద్, నర్సాపూర్ ఏరియా ఆస్పత్రులకు.. సీజనల్ వ్యాధులు పంజా విసురుతుండడంతో ఔట్‌పేషంట్‌లు సంఖ్య భారీగా పెరుగుతోంది. పేరుకు వందపడకల ఆస్పత్రులైనప్పటికీ వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తుండడంతో ఈ ఆస్పత్రుల్లో రోగులకు అవస్థలు తప్పడం లేదు.



నర్సాపూర్‌లో వైద్యుడి గది వద్ద వేచి ఉన్న రోగులు



జహీరాబాద్‌లో ఓపీ రిజిస్ట్రేషన్ వద్ద రద్దీ

నర్సాపూర్‌లో పది మంది వైద్యులే



నర్సాపూర్ ఏరియా ఆస్పత్రి

నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి రోజుకు 500 మంది వరకు వివిధ ప్రాంతాల నుంచి ఔట్‌పేషెంట్లు వస్తుంటారు... నియోజకవర్గ పరిధిలో ఏదేని ప్రమాదంలో గాయపడిన వారిని ఇక్కడికే తీసుకువస్తారు. ఇంత ప్రాధాన్యం ఉన్న ఆసుపత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. ఉన్న వారిపై పనిభారంతో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందక రోగులకు పాట్లు తప్పడం లేదు. ఆసుపత్రిలో 25 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 12మంది మాత్రమే ఉన్నారు. ఉన్న వారిలో ఒకరు తూప్రాన్ ఆసుపత్రికి డిప్యూటేషన్‌పై వెళ్లగా, మరొకరు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. దీంతో కేవలం పది మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. వీరిలోనూ ఇద్దరు మాత్రమే డ్యూటీ డాక్టర్లు ఉన్నారు. స్పెషలిస్టు వైద్యులకూ డ్యూటీ డాక్టర్ల విధులు నిర్వహించక తప్పడం లేదు. రాత్రిపూట డ్యూటీ డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదు. దీంతో రోగులను సంగారెడ్డి, హైదరాబాద్‌కు తరలించాల్సి వస్తుంది. ఇక స్పెషలిస్టులలో కూడా గైనకాలజిస్టులు ఐదుగురు ఉండాల్సి ఉండగా, ముగ్గురే ఉన్నారు. ఆర్థోపెడిక్ డాక్టర్ తూప్రాన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో ఎవరు రాలేదు. స్కిన్ స్పెషలిస్టు, రేడియాలజిస్టు, ఐ స్పెషలిస్టును నియమించాల్సి ఉంది. ఆసుపత్రిలో నర్సులు కూడా సరిపడా లేకపోవడంతో రోగులకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నది. 30 మంది వరకు నర్సులు ఉండాల్సి ఉండగా 20 మంది మాత్రమే ఉన్నారు. అందులో ఏడుగురు మెదక్ ఆసుపత్రికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. మరోవైపు ఆస్పత్రిలో సీటీ స్కానింగ్ లేదు. అల్ట్రాసౌండ్ పరికరం ఉన్నా పూర్తిస్థాయి రేడియాలజిస్టు లేకపోవడంతో స్కానింగ్ కోసం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి తప్పడం లేదు. ఇక డిజిటల్ ఎక్స్‌రే ఉన్నా తరచూ చెడిపోతుంది. ఆర్థోపెడిక్, డెంటల్ సంబంధించిన అధునాతన పరికరాలు అసలే లేవు. అత్యవసర సమయంలో వినియోగించేందుకు ఇక్కడ రక్త నిల్వ కేంద్రం ఏర్పాటు చేసినా నిరుపయోగంగానే ఉంది. ఇప్పటికైనా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

జహీరాబాద్ ఏరియాస్పత్రిలోనూ అంతే!

జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చినప్పటికీ అవసరమైన వైద్యులను మాత్రం నియమించలేదు. రోజు ఆస్పత్రికి సుమారు 1200 మంది రోగులు వస్తుంటారు. అలాగే డయాలసిస్, చిల్డ్రన్స్, గైనకాలజిస్టు తదితర విభాగాల్లో మరో 300 మంది ఇన్ పేషెంట్లు ఉంటారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ కావడంతో వైరల్‌ఫీవర్‌లు సోకుతున్న నేపథ్యంలో ఆస్పత్రికి రోగుల తాకిడి అధికమైంది. ఆస్పత్రితో సాంకేతిక సౌకర్యాలు ఉన్నప్పటికీ, వైద్యుల కొరత ఉండడంతో రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదు. 36 మంది వైద్యులు ఉండగా, 10 మంది వైద్యులు వివిధ కారణాలతో వెళ్లడంతో 26 మంది మాత్రమే విధులను నిర్వహిస్తున్నారు. అందులో ఆరుగురు డిప్యూటేషన్‌పై వివిధ జిల్లాలకు వెళ్లారు. మరో ఇద్దరు వైద్యులు విధులకు రిజైన్ చేశారు. దీంతో 18 మంది వైద్యులు మాత్రమే సేవలందిస్తున్నారు. ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో పనిచేసేందుకు వీలుగా 150 మంది సిబ్బందిని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించారు. అన్నీ బాగానే ఉన్న రోగులకు సేవలందించేందుకు వీలుగా వైద్యులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసర సమయాల్లో వైద్యులు అందుబాటులో ఉండకవడంతో హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు తరలిస్తున్నారు. డివిజన్ పరిధిలో పెద్దాస్పత్రి ఇదే కావడం, ముఖ్యంగా 65వ నంబర్ జాతీయరహదారికి సమీపంలో ఉండడంతో రోడ్డు ప్రమాదాలు బాధితులు ఎక్కువగానే వస్తుంటారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి వైద్యులను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.



జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి



జోగిపేట ఏరియా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న వల్లూరిక్రాంతి

జోగిపేట, ఆగస్టు 27 : ఇది వ్యాధుల కాలమని, అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. మంగళవారం ఆమె అందోలు - జోగిపేట మున్సిపల్ పరిధిలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో పారిశుధ్యాన్ని పరిశీలించారు. ప్రతీ వార్డుకు ముగ్గురు చొప్పున అధికారులను నియమించి సీజనల్ వ్యాధులపై, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏడో వార్డులో పర్యటించిన కలెక్టర్ అక్కడి బస్తీ దవాఖానాను తనిఖీ చేశారు. అనంతరం జోగిపేట ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఆస్పత్రి వార్డుల్లో కలియ తిరిగారు. రోగులతో మాట్లాడి, వైద్యం అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రోగులు వైద్యులు, సిబ్బంది తీరు పట్ల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆస్పత్రి వైద్య సిబ్బందిపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. రోగుల పట్ల కఠినంగా వ్యవహరించద్దని, మరోసారి పొరపాటు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ తిరుపతి, మెప్మా ఆర్పీ భిక్షపతి గౌడ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

మందుల కొరత లేకుండా చూడాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నర్సాపూర్ ఏరియాస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, ఆగస్టు 27: ఇతర జిల్లాలతో పోలిస్తే మెదక్ జిల్లాలో డెంగ్యూ కేసులు తక్కువే ఉన్నాయని, వైరల్, టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదువుతున్నాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిని ఆయన సందర్శించారు. స్టోర్‌రూములో మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు మూడు డెంగ్యూ కేసులు నమోదయ్యాయని, అవి తగ్గుముఖంలో ఉన్నాయన్నారు. మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలకు అపరిశుభ్రత వాతవరణమే కారణమన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట సూపరిండెంట్ డాక్టర్ మీర్జాబేగ్‌తో పాటు ఇతర డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల పరిశీలన

మెదక్ కల్చరల్ : మెదక్ పట్టణం పిల్లికొట్యాలలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల పనులను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం పరిశీలించారు. డిపార్ట్మెంటల్ గదులు, ల్యాబ్, ప్రయోగశాలలు, వివిధ రకాల వసతి ఏర్పాట్లను పరిశీలించారు.

వీధి కుక్కల బెడద నివారణకు చందాలు

నడుంబిగించిన బాచేపల్లి యువకులు



చందా జమ చేస్తున్న యువకుడు

కల్హేర్, ఆగస్టు 27 : తమ సమస్యను తామే పరిష్కరించుకోవడానికి యువకులు నడుం బిగించారు. వీధి కుక్కల బెడద నివారణకు శునకాలను పట్టేవారిని తీసుకొచ్చేందుకు మండల పరిధిలోని బాచేపల్లి గ్రామ యువకులు చందాలు జమ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం గ్రామానికి చెందిన పుట్టి సాయిలు పాడి గేదెను వీధి కుక్కలు కరిచి చంపగా, గ్రామంలోని కొందరు సైతం కుక్క కాటుకు గురయ్యారు. పదిహేను రోజుల క్రితం బాచేపల్లి గ్రామ వాటర్‌మెన్ సాయిలుతో పాటు మరికొందరిని కుక్కలు కరిచాయి. గ్రామంలో గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండటంతో స్థానికులు ఎప్పుడేం జరుగుతుందోనని తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. స్థానిక గ్రామ పంచాయితీ కార్యదర్శికి విన్నవించినా ఫలితం లేదు. ఇక చేసేదేమీ లేక గ్రామ యువకులు రంగంలోకి దిగారు. కుక్కల బాధను నివారించడానికి మంగళవారం చందాలు జమ చేయడం ప్రారంభించారు. గ్రామంలోని కుక్కలన్నిటినీ పట్టి దూర ప్రాంతంలో వదిలిపెట్టడానికి కుక్కలు పట్టేవారి కోసం ఈ చందాలు వేసుకుంటున్నట్లు బాచేపల్లి గ్రామ యువకులు తెలిపారు.

వసతి గృహంలో చదివి ఐఏఎస్ అయ్యా

గురుకులం విద్యార్థులతో ట్రైనీ కలెక్టర్ మనోజ్

పుల్‌కల్, ఆగస్టు 27 : తాను ప్రభుత్వ వసతిగృహంలో చదువుకుని ఐఏఎస్ అయ్యానని, ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలని ట్రైనీ కలెక్టర్ మనోజ్ సూచించారు. మంగళవారం ఆయన డీఈవో వెంకటేశ్వర్లు, ఎంఈవో కిషన్‌లతో మండలంలో పర్యటించారు. గొంగ్లూరు జడ్పీహెచ్, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. భోజనం ఎలా ఉంది అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పుల్కల్‌లోని కేజీబీవీలో విద్యార్థులతో కలిసి ట్రైనీ కలెక్టర్ మనోజ్ భోజనం చేశారు. వంట గదులను పరిశీలించి, గదులను ఎప్పటికప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. 6, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల డార్మెంటరీహాలు, తరగతి గదుల్లో కలియతిరిగారు. సౌకర్యాలపై ఆరా తీశారు. వంటగదులు, పాత్రలు, కూరగాయల నిల్వను పరిశీలించారు. వసతి గృహంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు సౌకర్యాలు లేవంటూ విద్యార్థులు ట్రైనీ కలెక్టర్ మనోజ్‌కు ఫిర్యాదు చేశారు. ఎందుకు సౌకర్యాలు కల్పించడం లేదంటూ ప్రిన్సిపాల్ ఆగమయ్యను మనోజ్ ప్రశ్నించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి అదనంగా నిధులు మంజూరయ్యేలా చూస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. భవిషత్తులో మీరు ఏం అవుతారంటూ పలువురు విద్యార్థులను ట్రైనీ కలెక్టర్ ప్రశ్నించగా, ఉన్నత చదువులు చదువుకుని డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఐఏఎస్, ఐపీఎస్‌లమవుతామంటూ వారు తెలిపారు. కోడూరులో ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ (కనీస భాష, గణిత సామర్థ్యాల సాధన) అమలు తీరును ఆయన పరిశీలించారు.



విద్యార్థితో మాట్లాడుతున్న మనోజ్

రుణమాఫీ సర్వేకు శ్రీకారం

- నేటి నుంచి క్షేత్రస్థాయిలో అధికారుల పర్యటన
- మాఫీ కానీ రైతుల వివరాల సేకరణ

మెదక్, ఆగస్టు 27 : రైతు రుణమాఫీ సమస్యలు పరిష్కరించేందుకు వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం తప్పుల సవరణలకు మార్గదర్శకాలు జారీ చేసింది. రుణమాఫీకి సంబంధించిన ఎలాంటి ఫిర్యాదునైనా వ్యవసాయాధికారి స్వీకరించేలా ఆదేశాలు జారీ అయ్యాయి. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా రుణమాఫీ కాని రైతుల వద్దకు మండల వ్యవసాయాధికారులు స్వయంగా వెళ్లి పరిశీలన జరుపుతారు. మాఫీ ఎందుకు కాలేదో కారణాలు తెలుసుకోనున్నారు.

మాఫీ కానీ వారు 6,208 మంది

మెదక్ జిల్లాలో ఇప్పటివరకు 6,208 మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఫిర్యాదులు అందాయని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ తెలిపారు. జిల్లాలో మొదటి విడత కింద లక్ష రూపాయల లోపు రుణమాఫీ 51,492 మంది రైతులకు వర్తించింది. లక్షన్నర లోపు రెండో విడతగా 22,850 మంది రైతులకు లబ్ధి చేకూరింది. మూడో విడతలో రెండు లక్షల లోపు 12,306 మందికి రుణమాఫీ జరిగినట్లు అధికారులు తెలిపారు.


వివరాలు యాప్‌లో నమోదు

రైతు రుణమాఫీ కాని రైతుల వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం యాప్‌ను తీసుకొచ్చింది. అర్హులై ఉండి రేషన్ కార్డు లేకపోవడం, ఆధార్ కార్డులో తప్పుగా ఉండడం, పాస్‌బుక్కు లేకపోవడం, ఆధార్‌లో పేరు, లోన్ ఖాతాలో పేరులో లోపాలు, అసలు, వడ్డీ మొత్తంలో సరిపోలక పోవడం ఇలా రుణ మాఫీకి సంబంధించి ఇతర సమస్యలుంటే వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకువస్తే నివృత్తి అయ్యే అవకాశం ఉంది. రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేసిన వారి ఇళ్లకు వ్యవసాయాధికారులు వెళ్లి రుణఖాతాలు, ఆధార్‌కార్డు తనిఖీ చేస్తారు. కుటుంబ సభ్యుల వివరాలు ఆరా తీస్తారు. ఫొటోలను సేకరిస్తారు. ఒక వేళ రైతు ఆధార్‌కార్డు తప్పు ఉంటే ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్‌కార్డు వంటి ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డులను తీసుకుని వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే చర్యలు : మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఆగస్టు 27: వినాయక చవితి ఉత్సాహలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశానికి ఎస్పీ హాజరై మాట్లాడారు. ప్రశాంతమైన మెదక్ జిల్లాలో గణేష్ ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వందతులను నమ్మొద్దని, తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వినాయక మండపాలకు అనుమతి తీసుకోవాలని సూచించారు. ప్రతీ చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు నిమజ్జన శోభయాత్ర ప్రశాంత వాతావరంలో నిర్వహించాలన్నారు. శాంతిభద్రత సమస్య తలెత్తకూడదని, ఈ విషయంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపడుతామన్నారు. గ్రామ, పట్టణాల్లో నిర్వాహకులతో ఇన్‌స్పెక్టర్లు సమావేశమై ఏర్పాట్లను సమీక్షించాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ.. నిర్వహణ, భద్రతకు సంబంధించి మున్సిపల్, అగ్నిమాపక, నీటి పారుదల, విద్యుత్, రవాణా శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, ప్రతీచోట నిర్వాహక కమిటీ వివరాలు, ఫోన్‌నంబర్లు, ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు ఉంటే భద్రత పెంచాలని, అవసరమైన చోట్ల ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ నాగరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్, కౌన్సిలర్లు, పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

తెల్లవన్నీ పాలు కావు!

- పౌడర్, పామాయిల్‌తో కృత్రిమ పాలు తయారీ
- ప్రజారోగ్యంతో చెలగాటం



కృత్రిమ పాలు తయారీకి ఉపయోగించే పాలపౌడర్, పామాయిల్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 27 : కనిపించేదంతా నిజం కాదు.. తెల్లవన్నీ పాలు కావు.. గతంలో కొందరు వ్యాపారులు పాలలో నీళ్లు కలిపేవారు. పాలకు రోజురోజుకు పెరుగుతున్న డిమాండ్ కారణంగా కొందరు ఏకంగా కృత్రిమ పాలనే తయారు చేస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ఈ కల్తీ పాలను సరఫరా చేసి ప్రజలకు విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో పాలను కొనుగోలు చేసిన ప్రజలు మాత్రం అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు.

రెండు లీటర్ల పాలతో 30 లీటర్లు తయారీ

రెండు లీటర్ల పాలు ఉంటే దాంతో 30 లీటర్ల పాలు తయారు చేయొచ్చు. పాల పౌడరు, 2 లీటర్ల పామాయిల్, రెండు లీటర్ల పాలతో బెర్రింగ్ చేసి 30 లీటర్ల పాలను తయారు చేస్తున్నారు. చూడటానికి స్వచ్ఛమైన పాల లాగే కనిపించే ఈ కృత్రిమ పాలను సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పాల కేంద్రాలకు రవాణా చేస్తున్నారు. కృత్రిమ పాలు అన్న విషయం తెలియక ప్రజలు మాత్రం కొనుగోలు చేసి రోగాల బారిన పడుతున్నారు.

కృత్రిమ పాల తయారీ గుట్టురట్టు

జిల్లాలోని హత్నూర మండలం గోవిందరాజ్‌పల్లి గ్రామంలో బొమ్మ శంకరయ్య తన వ్యవసాయ పొలంలో 70 ముర్రా జాతి ఆవులతో డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్నాడు. డబ్బు సంపాదించాలనే దురాశతో అతని కొడుకు రాఘవేంద్రతో పాటు ఏడుగురు బీహార్ కార్మికుల సహాయంతో కృత్రిమ పాలను తయారీ చేసేవాడు. పాల పౌడర్, పామ్ ఆయిల్, రెండు లీటర్ల ఆవుపాలతో మిక్స్ చేసి 30 లీటర్లు తయారీ చేసేవాడు. ఇలా రోజుకు 2వేల లీటర్ల కృత్రిమ పాలు తయారు చేసి జోగిపేట, నారాయణఖేడ్ తదితర ప్రాంతాల్లోని పాల కేంద్రాలకు సరఫరా చేసేవారు. కొన్ని నెలలుగా నిర్వహిస్తున్న ఈ కృత్రిమ పాల కల్తీ వ్యాపారాన్ని జిల్లా పోలీసులు గుట్టు రట్టు చేశారు. ఏప్రిల్ 3వ తేదీన టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి కృత్రిమ పాల కేంద్రాన్ని సీజ్ చేయడంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.



గోవిందరాజ్‌పల్లిలో కృత్రిమ పాల తయారీని చూస్తున్న ఎస్పీ(ఫైల్)

పాలను కల్తీ చేస్తే పీడీ కేసులు



అభం శుభం తెలియని చిన్నారులకు అందజేసే పాలను కల్తీ చేసినా, కృత్రిమ పాలు తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వ్యాపారులపై కొరడా ఝుళిపిస్తున్నాం. నిందితులపై అవసరమైతే పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తాం. జిల్లాలో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదు. ఎంతటి వారైనా చట్టప్రకారం శిక్షార్హులే. జిల్లాలో ఎవరైనా పాలను కల్తీ చేసినా, కృత్రిమ పాలు తయారు చేసినా పోలీసులకు నిర్భయంగా ఫిర్యాదు చేయండి. ప్రజల సంక్షేమం కోసం పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుంది.

- చెన్నూరి రూపేష్, సంగారెడ్డి ఎస్పీ

కల్తీ పాలతో కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు



కల్తీ, కృత్రిమ పాలు సేవించడం వల్ల పిల్లల్లో ఎదుగుదల ఆగిపోతుంది. ఎముకలు దెబ్బ తింటాయి. పిల్లలు, పెద్దలకు కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు, కీళ్ల నొప్పులు వచ్చే ప్రమాదం ఉంది. చిన్నారులకు పట్టించే పాలు స్వచ్ఛమైనవిగా గుర్తించిన తర్వాతనే ఇవ్వాలి. కల్తీ పాలను గుర్తించకపోతే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది.

- డాక్టర్ ఆర్.పరుశురాం, జనరల్ ఫిజీషియన్, సంగారెడ్డి

సంగారెడ్డిలో ఫుడ్ లైసెన్స్ మేళాకు స్పందన

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 27 : సంగారెడ్డిలోని జిల్లా ఫుడ్ సేఫ్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఫుడ్ లైసెన్స్ మేళాకు స్పందన లభించింది. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ ఆధ్వర్యంలో ఫుడ్ లైసెన్స్ మేళా నిర్వహించారు. ఫుడ్ లైసెన్స్ పొందేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు భారీగా తరలివచ్చారు. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో వీధి ఆహార వ్యాపారులకు ఫుడ్ సేఫ్టీపై అవగాహన నిర్వహించారు. లైసెన్స్ లేని త్వరితగతిన తీసుకోవాలని వ్యాపారులకు సూచించారు. దీంతో ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ కోసం వచ్చిన వారికి అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి చలానా కట్టించి లైసెన్సులు జారీ చేశారు. సుమారు వంద మంది వ్యాపారులు ఫుడ్ లైసెన్సులు పొందారని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ పొందకుండా నిర్వాహకులు క్రయవిక్రయాలు చేయవద్దని సూచించారు. లైసెన్స్ లేకుండా, నిబంధనలకు పాటించకుండా విక్రయాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.


సంగారెడ్డి ఫుడ్ లైసెన్స్ మేళాకు హాజరైన వ్యాపారులు

మా రోడ్డును బాగు చేయరూ..

● అదనపు కలెక్టర్‌కు ఇరిగిపల్లి గ్రామస్థుల వినతి

సంగారెడ్డిరూరల్, ఆగస్టు 27 : మా గ్రామానికి వెళ్లే రోడ్డును బాగుచేసి ప్రమాదాలను అరికట్టాలని ఇరిగిపల్లి గ్రామస్థులు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. చిన్న వర్షం కురిసినా తమ గ్రామానికి వెళ్తే రోడ్డు చిత్తడిగా మారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. రోడ్డు బాగుచేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామస్థులంతా ఏకమై సంతకాల సేకరణ చేపట్టామని, రోడ్డు బాగు చేసే వరకు స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాలని తీర్మానించినట్లు చెప్పారు. వీలైనంత త్వరగా రోడ్డును బాగుచేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బొబ్బిలి రాజు, చారి, సురేష్, సాగర్, నందు గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

గుడిసె దగ్ధం

● కాలిపోయిన రూ.60వేల నగదు, బియ్యం


కంచన్‌పల్లిలో దగ్ధమైన గుడిసె

కౌడిపల్లి, ఆగస్టు27: విద్యుదాఘాతానికి గుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని కంచన్‌పల్లిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన ఏర్పుల శాఖయ్య తన కుటుంబసభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం వారంతా అరుబయట ఉండగా ఒక్కసారి విద్యుత్‌షాక్ వల్ల మంటలు చెలరేగాయి. మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలించలేదు. గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న రూ.60 వేల నగదు, 2 క్వింటాళ్ల బియ్యం కాలిపోయింది. అధికారుల తమను ఆదుకోవాలని శాఖయ్య కుటుంబీకులు కోరుతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

● ఎంఈవో బుచ్చయ్య నాయక్

చిన్నశంకరంపేట, ఆగస్టు 27 : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఎంఈవో బుచ్చయ్య నాయక్ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని హైస్కూల్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. అనంతరం ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పాఠశాల స్థితిగతులపై ప్రధానోపాధ్యాయుడు దీప్లానాయక్‌తో సమీక్షించారు.





సిద్దిపేట పట్టణంలోని విద్యుత్ భవన్‌లో విద్యుత్ ప్రజావాణిలో మాట్లాడుతున్న అధికారులు, హాజరైన అధికారులు, వినియోగదారులు

విద్యుత్ సమస్యలపై వినియోగదారుల అర్జీలు

- త్వరలోనే పరిష్కరిస్తామన్న అధికారులు
- విద్యుత్ ప్రజావాణికి 86 దరఖాస్తులు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 27: ఎన్నోరోజులుగా నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలంటూ విద్యుత్ అధికారులు, సిబ్బందికి విన్నవించుకున్నా పరిష్కరించడం లేదంటూ సిద్దిపేట సబ్ డివిజన్‌కు చెందిన రైతులు, ప్రజలు తమ గోడను వెళ్లబుచ్చుకున్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని విద్యుత్ భవన్‌లో సీజీఆర్‌ఎఫ్(కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రీడ్రెసెల్ ఫోరం) హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రజావాణిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎసీ చైర్మన్ పి.నాగేశ్వర్‌రావు, టెక్నికల్ సీఈ సభ్యుడు రామాంజనేయ నాయక్, సిద్దిపేట జిల్లా ఎస్ఈ టీఆర్ చంద్రమోహన్ మాట్లాడుతూ విద్యుత్ ప్రజావాణిలో విద్యుత్ పరమైన సమస్యలు, లో వోల్టేజీ సమస్యలు ఇతరత్రా వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. దీంతో రైతులు విద్యుత్ పోల్స్, ఓవర్ లోడ్, లో వోల్టేజీ, వ్యవసాయ భూమిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల హార్వేస్టర్ రావడం లేదంటూ పలు సమస్యలను దరఖాస్తు రూపంలో వినియోగదారులు విన్నవించుకున్నారు. దీంతో మొత్తంగా 86 అర్జీలు వచ్చినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి



వ్యవసాయ భూముల వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలాడటంతో ప్రమాదకరంగా మారింది. అటువైపు వెళ్లాలంటేనే భయమేస్తున్నది. రెండేళ్ల నుంచి విద్యుత్ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. విద్యుత్ స్తంభాల మధ్య దూరం తగ్గించి మరిన్ని స్తంభాలను ఏర్పాటు చేయాలి. విద్యుత్ ప్రజావాణిలో సమస్యను పరిష్కరిస్తారని అర్జీ అందజేశాను.

- వెంకటరమణారెడ్డి, వెల్కటూర్, నంగునూరు మండలం

పశువులు చనిపోతున్నాయి



తమ వ్యవసాయ భూముల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రిక వద్ద విద్యుత్‌ను నియంత్రించే ఆన్ ఆఫ్ సిస్టమ్ లేకపోవడంతో పశువులు విద్యుదాఘాతానికి గురై చనిపోతున్నాయి. కొన్నినెలలుగా సమస్యను పరిష్కరించాలని విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని విద్యుత్ ప్రజావాణిలో హామీనిచ్చారు.

- లక్ష్మణ్, అక్కెనపల్లి

ఆలయాల్లో చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

- 7.5 తులాల బంగారు ఆభరణాలు,182 తులాల వెండి వస్తువులు స్వాధీనం
- రెండు ద్విచక్ర వాహనాలు సీజ్, పరారీలో మరో నిందితుడు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ మధు



సిద్దిపేట ఏసీపీ కార్యాలయంలో కేసు వివరాలను వెల్లడిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు

చిన్నకోడూరు, ఆగస్టు 27: సిద్దిపేట జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామ దేవత ఆలయాల్లో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. సిద్దిపేట ఏసీపీ కార్యాలయంలో కేసు వివరాలను మంగళవారం రాత్రి ఆయన వెల్లడించారు. ఇటీవల జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామదేవత ఆలయాల్లో తరచూ చోరీలు జరుగుతుండటంతో చోరీలను ఛేదించేందుకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సిద్దిపేట ఏసీపీ మధు ఆధ్వర్యంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ, రాజగోపాల్‌పేట ఎస్ఐ అసిఫ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సిబ్బందితో ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేశారు. కేసుల పరిశోధనలో భాగంగా టెక్నాలజీ, సీసీ కెమెరాల ఆధారంగా ఆధారాలు స్వీకరించి మంగళవారం ఉదయం సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సంబంధిత అధికారులు, సిబ్బందితో కలిసి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బోదాసు యాదగిరి టీవీఎస్ ఎక్సెల్ మీద, దూల్మిట్ట మండలానికి చెందిన వల్లేపు శేఖర్ (ప్రస్తుత నివాసం సిద్దిపేట పట్టణం ఇందిరమ్మ కాలనీ) బైక్‌పై సిద్దిపేట నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్నారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకుని విచారించగా పలు ఆలయాల్లో చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించారు. వారి వద్ద నుంచి 7.5 తులాల బంగారు ఆభరణాలు, 182 తులాల వెండి వస్తువులు, రెండు ద్విచక్ర వాహనాలు మొత్తం రూ.7 లక్షల విలువైన వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు. కాగా మరో నిందితుడు కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన కొమిరె శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ, రాజగోపాల్‌పేట ఎస్ఐ అసిఫ్, సీసీఎస్, పోలీసు సిబ్బందిని ఏసీపీ మధు అభినందించారు. త్వరలో సీపీకి రివార్డు ప్రపోజల్ పంపిస్తామని ఆయన తెలిపారు.

వైభవంగా గోకులాష్టమి

- రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి విశేష పంచామృతాభిషేకాలు, లక్ష పుష్పార్చన



గోకులాష్టమి సందర్భంగా పుష్పార్చన చేస్తున్న భక్తులు

వర్గల్, ఆగస్టు 27: వర్గల్ మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గోకులాష్టమి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితుడు వేదాంతం మురళీధరచార్యుల నేతృత్వంలో ఉదయం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వద్ద భగవద్గీత పారాయణం, విష్ణుసహస్రనామ పారాయణం, ఆరాధన, బాలభోగంతో పాటు తదితర పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ యాగశాలలో సుదర్శన హవనం, పూర్ణాహుతి చేశారు. వేడుకల సందర్భంగా ఆలయ మండపంలో లక్ష పుష్పార్చనతో పాటు వివిధరకాల పండ్ల రసాలతో కూడిన పంచామృతంతో శత కలశాభిషేకం చేశారు. ప్రత్యేక పర్వదినం సందర్భంగా దేవతామూర్తులకు 51 రకాల స్వీట్లతో నివేదన సమర్పించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు ప్రొద్దటూరి రాజులుగుప్తా, గజ్వేల్ మాజీ ఏఎంసీ చైర్మన్ టేకులపల్లి రాంరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. వేడుకల అనంతరం వేణుగోపాలస్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గీతాజ్ఞాన భజనమండలి సభ్యులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తిపారవశ్యమైంది.

మాకొద్దీ కంపు.. డంపు

- డంపింగ్‌యార్డును తొలగించాలని గ్రామస్థుల ధర్నా



ఫసల్‌వాదిలోని డంపింగ్‌యార్డు ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 27: సంగారెడ్డి మున్సిపాలిటీకి చెందిన చెత్తాచెదారాన్ని ఇక్కడ వేయడం వల్ల తమకు రోగాలు వస్తున్నాయని.. మాకొద్దీ.. కంపు అంటూ గ్రామస్థులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్‌యార్డును ఫసల్‌వాది గ్రామానికి చెందిన రుద్రారం నర్సమ్మకు చెందిన సర్వే నంబర్ 599-31, 599-35 4.05 ఎకరాల వ్యవసాయ పట్టా భూమిలో ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. డంపింగ్‌యార్డు వల్ల దోమలు, క్రిమి, కీటకాలు వృద్ధి చెంది గ్రామస్థులు రోగాల బారినపడతారని అన్నారు. డంపింగ్‌యార్డును ఇక్కడి నుంచి తొలగించి.. ఇతర ప్రదేశంలో, ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయన్న, సంగమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా బస్టాప్!

- అంబులెన్సుల పార్కింగ్‌కు అడ్డాగా బస్‌షెల్టర్
- బస్టాప్ ఓ చోట.. ప్రయాణికులు నిల్చునేది మరోచోట
- పట్టించుకోని సంబంధిత అధికారులు



సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రి బస్టాప్ వద్ద నిలిపిన అంబులెన్స్‌లు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 27: సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఉన్న బస్టాప్ ప్రైవేటు అంబులెన్సులకు అడ్డాగా మారింది. ప్రయాణికులు నిల్చోవాల్సిన బస్టాప్ అంబులెన్సుల పార్కింగ్‌కు నిలయంగా తయారైంది. బస్టాప్ మూడువైపుల అంబులెన్సులు పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు అటుగా వెళ్లేందుకు ఆస్కారం లేకుండా పోయింది. తద్వారా ప్రయాణికులు బస్టాప్ కొద్ది ముందుగా నడిరోడ్డుపై నిల్చోని ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందిపడుతూ బస్సుల కోసం వేచిచూస్తున్నారు. నాలుగేళ్ల ఇదే బస్టాప్ సమీపంలో రోడ్డుపై నిల్చున్న ఓ హెడ్‌నర్సును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇదిలా ఉండగా ఈ బస్టాప్‌ను ఆనుకునే పట్టణ, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. పోలీసులు తొంగి చూస్తే ఈ బస్టాప్ వద్ద అడ్డంగా నిలిపిన అంబులెన్స్‌లు స్పష్టంగా కనిపిస్తాయి. కానీ ప్రయాణికులు బస్టాప్ వద్దనే నిల్చోవాలని సూచించడం కానీ, బస్టాప్ వద్ద నిలిపిన వాహనాలను తొలగించే చర్యలు కానీ ఇటు పోలీసులు, అటు ఆర్టీసీ అధికారులు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తున్నది.

భూముల ఆక్రమణలపై ఫిర్యాదుల వెల్లువ

ప్రభుత్వ భూముల కబ్జాలు, అక్రమ కట్టడాలపై 'హైడ్రా' కొరడా ఝుళిపిస్తున్న నేపథ్యంలో సిద్దిపేట జిల్లాలోని పలు మండలాల్లో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఆక్రమణలకు గురైన భూములు, చెరువులు, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఫిర్యాదు చేస్తున్నారు.



బండతిమ్మాపూర్‌లో కబ్జాకు గురైన భూమిని అడ్డుకున్న గ్రామస్థులు

ములుగు, ఆగస్టు 27: బండతిమ్మాపూర్ గ్రామ శివారులో ఉన్న పాల సముద్రం చెరువు భూమిని ఓ కంపెనీకి చెందిన వ్యక్తులు ఆక్రమించి రాత్రికిరాత్రి ప్రహరీ నిర్మించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, యువకులు మంగళవారం చెరువు భూముల్లో అక్రమంగా నిర్మించిన ప్రహరీని తొలగించాలని తరలివచ్చారు. కంపెనీ నిర్వాహకులు చెరువు భూమిని ఆక్రమిస్తున్నారని నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు మాట్లాడుతూ చెరువు భూమిలో అక్రమ కట్టడాలను అరికట్టాలన్నారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా.. రెండురోజుల్లో పోలీసుల సహాయం తీసుకుని ప్రహరీని తొలగిస్తామని ఇరిగేషన్ ఏఈ అస్లాం తెలిపారు.

ప్రభుత్వ భూముల స్వాధీనం సరైనదే

కొండపాక, ఆగస్టు 27: ప్రభుత్వ భూముల స్వాధీనం సరైనదేనని జాతీయ మానవ హక్కుల కమిటీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బద్దిపడిగ నరసింహారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అక్రమ కట్టడాల కూల్చివేత సంస్థ 'హైడ్రా' నిర్వహిస్తున్న ఆక్రమణల తొలగింపులకు మద్దతుగా ఆయన ఆధ్వర్యంలో వివిధ మండలాల అధ్యక్షుల సమక్షంలో కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హైడ్రా అనే సంస్థ ఆధ్వర్యంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడానికి తీసుకున్న చర్యలు ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ కొమురవెల్లి, కుకునూరుపల్లి, వర్గల్, ములుగు, జగదేవ్‌పూర్, మర్కుక్ మండలాల అధ్యక్షులు బొడుగం కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తెలకలపల్లి బాల్‌రెడ్డి, ఆరే శ్రీకాంత్, ఏల్లు రామ్‌రెడ్డి, సాయిరెడ్డి, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలువను కబ్జా చేసిన వారి పై చర్యలు తీసుకోవాలి

చిన్నకోడూరు, ఆగస్టు 27: మండలంలోని ఎల్లాయిపల్లి పెద్దగండి చెరువుకు అనుసంధానంగా ఉన్న కాలువను కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మైలారం గ్రామస్థులు కోరారు.మంగళవారం చిన్నకోడూరు తహసీల్దార్ జయలక్ష్మికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాలువను పునరుద్ధరిస్తే సుమారు 200 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

కబ్జాకు గురైన చెరువులపై అధికారులు దృష్టిపెట్టాలి: బీజేపీ

గజ్వేల్, ఆగస్టు 27: గజ్వేల్ పట్టణంలో కబ్జాకు గురైన చెరువులపై అధికారులు దృష్టి సారించి, వెంటనే చెరువులను కాపాడాలని బీజేపీ గజ్వేల్ పట్టణాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ డిమాండ్ చేశారు. గజ్వేల్‌లోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని చెరువుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను మట్టితో చదును చేసి వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారని, దీంతో చెరువుల విస్తీర్ణం తగ్గిపోతుందన్నారు. గజ్వేల్ చెరువులకు వెంటనే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను ఏర్పాటు చేసి రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట బీజేపీ నాయకులు అయిల మహేందర్, నాయిని సందీప్, చెప్యాల వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

మద్యం మత్తులో వృద్ధురాలిపై అఘాయిత్యం

- నారాయణఖేడ్ పట్టణంలో ఘటన

నారాయణఖేడ్, ఆగస్టు 27: నారాయణఖేడ్ పట్టణంలో మతి స్థిమితం లేని ఓ వృద్ధురాలిపై యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మతిస్థిమితం లేని 60 ఏళ్ల వృద్ధురాలు పట్టణంలోని ఓ దుకాణం వద్ద సోమవారం రాత్రి నిద్రిస్తుంది. మద్యం మత్తులో ఉన్న ఖేడ్ పట్టణానికి చెందిన యువకుడు ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దాంతో వృద్ధురాలు అరవడంతో స్థానికులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారమందించారు. సదరు అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు మంగళవారం రాత్రి డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు.

తాగుడుకు బానిసై ఒకరి ఆత్మహత్య



ఆగారెడ్డి(ఫైల్)

కోహెడ, ఆగస్టు 27: తాగుడుకు బానిసైన ఒకరు పురుగుల మందుతాగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోహెడ మండలం పోరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బర్రె ఆగారెడ్డి(45) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానుకోవాలని భార్య మంజుల, కుమార్తె అఖిల, కుమారుడు మనోహర్‌రెడ్డి తరచూ చెబుతున్నా.. మారడం లేదు. దీంతో భార్యాభర్తల గొడవతో భర్త గ్రామంలో ఉంటుండగా.. పిల్లల చదువు కోసం భార్య మంజుల సిద్దిపేటలో పిల్లలతో గతేడాదిగా ఉంటోంది. ఈ క్రమంలో ఆగారెడ్డి మరింత తాగుడుకు బానిసై అప్పుల పాలయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మాజీ సర్పంచ్ సంపత్‌రెడ్డి చూసి భార్య, పోలీసులకు సమాచారమందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు.

అనారోగ్యంతో ఆర్మీ ఉద్యోగి మృతి



గుండారం శ్రీనివాస్(ఫైల్)

గజ్వేల్, ఆగస్టు 27: అనారోగ్యంతో ఆర్మీ ఉద్యోగి మృతిచెందాడు. గజ్వేల్ మండల పరిధి రిమ్మనగూడ గ్రామానికి చెందిన గుండారం శ్రీనివాస్(40) 2002లో ఆర్మీకి ఎంపికై జమ్మూకాశ్మీర్‌లో మొదట విధుల్లో చేరారు. జమ్మూకాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, చైనా బార్డర్‌లలో ప్రెసిడెంట్ గార్డుగా విధులు నిర్వహించిన.. ఆయన ప్రస్తుతం ఆర్మీ హవల్దార్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల గ్రామానికి వచ్చిన శ్రీనివాస్ అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని ఆర్మీ ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మహారాష్ట్రలోని పూణే ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా మృతుడికి భార్య కవిత, పిల్లలు భానుతేజ్, లాస్య ఉన్నారు. శ్రీనివాస్ మృతితో రిమ్మనగూడ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన ప్రజలు, కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు ఆయన చిత్రపటం వద్ద పూలమాలవేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు నేడు, రేపు క్రీడలు

- జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఖాసీంబేగ్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 27: హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఈనెల 28, 29వ తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఖాసీంబేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు రన్ అండ్ వాక్, షాట్‌పుట్, త్రోబాల్, చెస్, బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్స్, టేబుల్ టెన్నిస్ నిర్వహించనున్నారు. అదేవిధంగా పురుషులకు వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో, చెస్, టేబుల్‌టెన్నిస్ తదితర క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ప్రభుత్వ ఉద్యోగులు తమ పేర్లను జిల్లా యువజన క్రీడల అధికారి కార్యాలయం వాట్సప్ నెంబర్ 7981798957, 7386191141కు పంపించి నమోదు చేసుకోవాలని సూచించారు.

భూలక్ష్మి అమ్మవారి ఆలయంపై దాడి

- విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులు
- హిందూ సంఘాల ఆందోళన
- సంఘీభావం తెలిపిన బీజేపీ నేతలు
- హైదరాబాద్ సంతోష్‌నగర్‌లో ఘటన
- ఇరువర్గాల మధ్య గొడవలు సృష్టించేందుకు కుట్రలు: మాధవీలత

సంతోష్‌నగర్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రక్షాపురం కాలనీలో ఉన్న భూలక్ష్మి ఆలయంపై సోమవారం రాత్రి కొందరు దుండగులు దాడికి పాల్పడ్డారు. దేవాలయం ప్రధాన ద్వారం తలుపులు బద్ధలు కొట్టి విగ్రహాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు, భక్తులు, హిందూ సంఘాల ప్రతినిధులు, పెద్ద ఎత్తున ఆలయం వద్దకు తరలివచ్చి నిరసన చేపట్టారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం తెలిసిన బీజేపీ నాయకులు అక్కడికి చేరుకుని సంఘీభావం తెలిపారు. వెంటనే పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర హామీతో సోమవారం అర్ధరాత్రి ఆందోళనకారులు శాంతించారు. విగ్రహాల ధ్వంసాన్ని నిరసిస్తూ మంగళవారం ఉదయం బీజేపీ నాయకురాలు మాధవీలత, పార్టీ కార్యకర్తలతో కలిసి ఆలయం వద్ద ధర్నా చేపట్టారు. హిందూ సంఘాల ప్రతినిధులు, బీజేపీ నేతలు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ముందు జాగ్రత్తగా పోలీసులు ఆలయ పరిసరాలలో దుకాణాలు మూసివేయించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ.. అతి పవిత్రమైన గోకులాష్టమి రోజు ఇలాంటి సంఘటన జరగడం చాలా బాధాకరం అన్నారు. వెంటనే చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ వచ్చి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఆలయంలో సంఘటన జరగడం విడ్డూరం అన్నారు. ఇరువర్గాల మధ్య గొడవలు సృష్టించేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇది హిందు, ముస్లిం సమస్యకాదని ఎంఐఎం సమస్య అని ఆమె అన్నారు.

పోలీస్‌స్టేషన్ ముట్టడికి యత్నం

విగ్రహాల ధ్వంసం కేసులో నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారని తెలియడంతో ఒక్కసారిగా బీజేపీ నేతలు, హిందూ సంఘాల నేతలు సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ ముట్టడికి యత్నించారు. పోలీసులు భారీ సంఖ్యలో ఉండటంతో వారిని అడ్డుకున్నారు. చివరకు బీజేపీ నాయ కులు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ సుభాష్‌ను కలిసి ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో ఈ సంఘటన జరిగిందని, సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించామని చెప్పారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలను సహించేది లేదని, కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు.

83.4 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- టాటా సఫారీ సీజ్, సెల్‌ఫోన్ స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితుడు

మునిపల్లి, ఆగస్టు 27: సంగారెడ్డి జిల్లా కంకోల్ టోల్‌గేట్ వద్ద ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 83.4 కిలోల ఎండు గంజాయిని సోమవారం పట్టుకున్న విషయం తెలిసిందే. ప్రొహిబిషన్, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సంగారెడ్డి, మెదక్ డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం తుని నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌కు టాటా సఫారీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా పుంగనూర్ మండలం ఈటవాకిలి గ్రామానికి చెందిన ఎస్.అసరఫ్ అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారంతో సోమవారం ఆ శాఖ అధికారులు కంకోల్‌టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీల్లో భాగంగా టాటా సఫారీని ఆపారు. అనుమానం వచ్చి తనిఖీ చేయగా.. 83.4 కిలోల ఎండు గంజాయి లభించినట్లు తెలిపారు. గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎండు గంజాయి విలువ రూ.30 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ గాంధీనాయక్, ఎస్ఐ అనిల్ కుమార్. హెడ్ కానిస్టేబుల్ ఎండీ.అలీం, కానిస్టేబుల్స్ మల్కయ్య, సతీష్, అనిల్‌కుమార్, గోపాల్, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్

చేర్యాల, ఆగస్టు 27: కొమురవెల్లి మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న కొమురవెల్లికి చెందిన ఇరువురు మైనర్లతో పాటు సిద్దిపేటకు చెందిన జంగం ఓంకార్, సమీర్, నగేశ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు చేర్యాల సీఐ ఎల్.శ్రీను తెలిపారు. కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ నిందితుల వివరాలను వెల్లడించారు. కొమురవెల్లి గ్రామానికి చెందిన ఇరువురు మైనర్లు గంజాయి సేవనానికి అలవాటు పడ్డారు. ఈ క్రమంలో చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రేమ్‌రాజ్‌తో పరిచయం ఏర్పడింది. అతడి ద్వారా గంజాయి కొనుగోలు చేస్తూ తోటి యువకులకు అలవాటు చేస్తున్నారని తెలిపారు. ఇదే క్రమంలో సిద్దిపేటకు చెందిన జంగం ఓంకార్, సమీర్, నగేశ్‌లు సోమవారం రాత్రి ఇరువురు బాలురతో కలిసి గ్రామ శివారులోని దాసారంగుట్ట వద్ద గంజాయి సేవిస్తూ.. విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ రాజుగౌడ్ వారిని పట్టుకున్నాడని తెలిపారు. వీరినుంచి 60 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. బాలురకు నోటీసులు జారీచేసి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశామని, సిద్దిపేటకు చెందిన ముగ్గురిని రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. పోతిరెడ్డిపల్లికి చెందిన ప్రేమ్‌రాజ్ పరారీలో ఉన్నాడన్నారు. మల్లన్న ఆలయ సమీపంలో అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామన్నారు.

పీఎం కుసుమ్ యోజనపై అవగాహన



తునికిలోని కేవీకేలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కౌడిపల్లి, ఆగస్టు 27: సోలర్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పీఎం కుసుమ్ యోజన తెలంగాణ చీఫ్ మోడరైటర్ రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తునికిలోని కృషి విజ్ఞాన జ్యోతి కేంద్రంలో నేషనల్ స్కిల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రైతులకు పీఎం కుసుమ్ యోజనపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు సోలార్ ప్యానళ్ల ఏర్పాటు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసిన అనంతరం మిగులు విద్యుత్‌ను విక్రయించే అవకాశం ఉందన్నారు. ప్రతీ రైతు సోలర్ వినియోగం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త ఉదయ్ కుమార్, శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి రైతులు ఉన్నారు.

జీపీ రెవెన్యూ సవరణ చేయాలని డీపీవోకు వినతి

కౌడిపల్లి, ఆగస్టు 27: గ్రామ పంచాయతీలోని రెవెన్యూ సవరణ చేయాలని మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామస్థులు మంగళవారం జిల్లా పంచాయతీ రాజ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి మాట్లడుతూ గిరిజన తండాలకు ప్రభుత్వం కొత్త పంచాయతీలు ఏర్పాటు చేయనుండటంతో తమ గ్రామ శివారులోని సర్వేనెంబర్ 284లో 1200 ఎకరాల భూమి ఉండగా పూర్తి రెవెన్యూ విస్తీర్ణం మహ్మద్‌నగర్ శివారులో ఉందని తెలిపారు. దీంతో నూతనంగా ఏర్పాటు కానున్న కొత్త చెరువు తండా పరిధిలోనికి మహ్మద్‌నగర్ శివారు చేర్చడంతో ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బురిగారి వెంకన్న, బాలగౌడ్, రవికుమార్ యాదవ్,బుజంగం, రఘు, కృష్ణ తో పాటు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

అడ్డగోలుగా పన్నుల పెంపు వసూళ్ల కోసమే..!

- తూప్రాన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- అభివృద్ధి నిధులను దారి మళ్లించొద్దు
- మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

తూప్రాన్, ఆగస్టు 27: అడ్డగోలుగా పన్నుల పెంపు, వివిధ అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులను దారి మళ్లింపు చేయడాన్ని నిరసిస్తూ తూప్రాన్ పట్టణంలో ఆందోళన చేపట్టారు. మంగళవారం తూప్రాన్ మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. బీఆర్ఎస్ ధర్నాతో మున్సిపల్ కార్యాలయం ఆవరణ నిరసనకారుల నినాదాలతో దద్దరిల్లింది. పట్టణంలో ఇంటి పన్నులు భారీగా పెంచుతూ ఇటీవల యజమానులకు నోటీసులు జారీ చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలలో ఎక్కడా లేని విధంగా విచ్చలవిడిగా పన్నులు పెంచుతూ నోటీసులు ఇచ్చారని బీఆర్ఎస్ ఆందోళనకు పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ మాజీచైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, వినతి పత్రం అందజేశారు. తూప్రాన్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకొని పాత హైవే మీదుగా నినాదాలు చేస్తూ మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా చేరుకున్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేట్టారు. పెంచిన పన్నులు తగ్గించాలని, నిధుల మళ్లింపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పన్నుల పెంపును తగ్గించాలని, దారిమళ్లింపు చేసిన మినీ స్టేడియం నిధులు రూ. 5.50 కోట్లు, పెద్దచెరువు సుందరీకరణ నిధులు రూ. 3.15 కోట్లు, ఆడిటోరియం నిధులు రూ. 8.00 కోట్లు యథావిధిగా వినియోగించాలని కమిషనర్ ఖాజామొయిజుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో నాయకులు బైరం సత్యలింగం, దుర్గారెడ్డి, తలారి మల్లేశ్, బొంది వెంకట్‌గౌడ్, సత్తార్, కిషన్, శ్రీకాంత్, ఆంజనేయులు, నాగేందర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ప్రవీణ్‌రెడ్డి, రాజు యాదవ్, మల్లేశ్‌యాదవ్, అంజయ్య పాల్గొన్నారు.,

వసూళ్ల కోసమే పన్నుల పెంపు సరికాదు

తూప్రాన్ మున్సిపాలిటీలో వసూళ్లు చేసుకోవడం కోసమే పన్నులను పెంచారని మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ ఆరోపించారు. పన్నుల పెంపుపై ధర్నా అనంతరం బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ.. పన్నుల పెంపుతో నోటీసులు జారీ చేస్తూ బేరాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పన్నులు పెంచుతూ నోటీసులు జారీ చేయడాన్ని ఆయన తప్పుపడుతూ,



మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకుల ధర్నా

మున్సిపల్ ఆమోదం లేదని తెలిపారు. పన్నుల పెంపులో వ్యత్యాసాలు ఉన్నట్లు వివరించారు. అధికార పార్టీ వాళ్లకు ఒక రకం పన్నులు, సామాన్య ప్రజలకు ఒక రకంగా పన్నులు వేస్తూ ఇబ్బందులు చేస్తున్నట్లు ఆరోపించారు. వీటన్నింటిని నిరూపించడానికి సిద్ధంగా ఉన్నట్లు రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. రూ. 10వేల పన్ను విధించే భవనానికి రూ. లక్షల్లో విధించి బేరాలు చేసుకొని పన్ను తగ్గిస్తున్నట్లు ఆరోపించారు. పన్నుల పెంపుతో బేరాలు చేసుకుంటూ ప్రజల నుంచి అందినంత దండుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి నిధులను దారి మళ్లించకుండా పనులు చేపట్టాలన్నారు.

మాజీ చైర్మన్ సహా 19 మందిపై కేసు

తూప్రాన్, ఆగస్టు 27: తూప్రాన్ పట్టణంలో పన్నుల పెంపుపై మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాపై పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజోద్దీన్ ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి కేసు నమోదైంది. మంగళవారం మధ్యాహ్నం రవీందర్‌గౌడ్ (రాఘవేందర్‌గౌడ్), సత్యలింగం, వెంకట్‌గౌడ్, తలారి మల్లేశం, దుర్గారెడ్డి, ఎండీ సత్తార్, యాసిన్, శ్రీకాంత్‌చారి, గాంధీ, బూర్గుపల్లి నాగేందర్‌రెడ్డి, గజం వీరేశం, మల్దారి శివ, ఇమ్రాన్, గుర్రం ఆంజనేయులు, ఎండీ అర్బాన్, ఉస్మాన్, ఏర్పుల బాల్‌రాజ్, బొంది మల్లికార్జున్‌గౌడ్, ఆంజనేయులు (ఆబోతుపల్లి), మల్లేశ్ (పోతరాజుపల్లి)లతోపాటు మరికొందరు తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట మెట్లపై అడ్డుగా కూర్చొని ప్రజల దారిని అడ్డగించి నినాదాలు చేస్తూ న్యూసెన్స్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు తూప్రాన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కుంటలో పడి ఒకరు మృతి



సుధీర్ (ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 27: అదృశ్యమైన వ్యక్తి కుంటలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని హరిచంద్ తండాలో చోటు చేసుకున్నది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హరిచంద్ తండాకు చెందిన కోల సుధీర్(25) సోమవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు గాలించగా తునికి శివారులోని పుల్ చెర్వుకుంట వద్ద చెప్పులు కనిపించాయి. అనుమానంతో కుంటలో వెతకగా శవం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంజిత్‌రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.

మర్పల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ

రేగోడు ఆగస్టు 27: మండలంలోని మర్పల్లి గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది, ఎస్ఐ పోచయ్య వివరాల ప్రకారం.. మర్పల్లి గ్రామానికి చెందిన మన్నె లక్ష్మి గత 5రోజుల కిందట ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. మంగళవారం ఇంటికి వచ్చేసరికి బీరువా తెరిచి ఉంది. లోపల పరిశీలించగా అందులో ఉంచిన రెండున్నర తులాల బంగారు గొలుసు (నాను) రూ. 1500 ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. ఇంటికి వేసిన తాళం అలాగే ఉందని, అయితే బీరువాలో ఉన్న బంగారం, నగదు మాత్రం చోరీకి గురైనట్టు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

జహీరాబాద్, ఆగస్టు 27: పట్టణంలోని రంజోల్ పాలిటెక్నిక్ వద్ద పెట్రోలింగ్ నిమిత్తం వెళ్లిన పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి తలారి నరేష్‌పై కేసు నమోదైంది. జహీరాబాద్ రూరల్ ఎస్ఐ. ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం.. విధి నిర్వహణలో భాగంగా పోలీసులు సోమవారం రాత్రి రంజోల్ గ్రామ సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల వైపు వెళ్లారు. అక్కడే గ్రౌండ్‌లో రంజోల్‌కు చెందిన తలారి నరేష్‌తోపాటు మరో ఇద్దరు మద్యం తాగుతున్నారన్నారు. ఈ క్రమంలో పోలీసువాహనం సైరన్‌విని ఇద్దరు వ్యక్తులు పారిపోగా నరేష్ అక్కడే ఉండి పోలీసువాహనం దగ్గరకువచ్చి విధుల్లో ఉన్న పోలీసులు భాస్కర్, వెంకట్‌రాంతో గొడవకు దిగాడు. వెంటనే పోలీసులు అతన్ని రూరల్‌పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా, స్టేషన్‌లో డ్యూటీ ఇన్‌చార్జిగా ఉన్న భీంసేన్‌తో కూడా గొడవకు దిగాడు. హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నరేష్‌ను రిమాండ్‌కు పంపినట్టు ఎస్ఐ వివరించారు.

మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ తనిఖీ

మనోహరాబాద్, ఆగస్టు 27: మనోహరాబాద్ మండల పోలీస్ స్టేషన్‌ను తూప్రాన్ సీఐ రంగాకృష్ణ మంగళవారం ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను ఆయన పరిశీలించారు. వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కారం అయ్యే విధంగా చూడాలని ఎస్ఐ సుభాష్‌గౌడ్‌కు సూచించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



జహీరాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రిలో తనఖీలు చేస్తున్న జిల్లా వైద్యాధికారి

జహీరాబాద్, ఆగస్టు 27: విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని జిల్లా వైద్యవిధానపరిషత్ సమన్వయకర్త డా. సంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలన్నారు. స్థానికంగా ఏమైన ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో పలురికార్డులను తనఖీలు చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శ్రీధర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



ఎమ్మార్‌హెచ్ఎస్ గ్రౌండ్‌లో క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎంఈవో బస్వరాజ్

జహీరాబాద్, ఆగస్టు 27: క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మండల విద్యాధికారి బస్వరాజ్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మార్‌హెచ్ఎస్ గ్రౌండ్‌లో ఆయా పాఠశాలల విద్యార్థులకు మండలస్థాయి క్రీడల(స్కూల్‌గేమ్ ఫెడరేషన్)పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలస్థాయిలో గెలుపొందిన వారు జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మండలంలోని 25 పాఠశాలలకు చెందిన 600 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని ఆయన వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాసాయిపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

మాసాయిపేట, ఆగస్టు 27: మాసాయిపేటలో మంగళవారం ఆక్సి విజన్ లేజర్ మేడ్చల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామస్థులకు, వృద్ధులకు, చిన్నారులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి కళ్లద్దాలను అందించారు. గ్రామంలోని సుమారు 300 మంది గ్రామస్థులకు ప్రజలకు ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు శ్రీనివాస్, సయ్యద్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వృద్ధాప్య సమస్యలపై ఉచిత వైద్య శిబిరం

మాసాయిపేట, ఆగస్టు 27: మండల కేంద్రంలోని ఆయుర్వేద ఆసుపత్రి ఆవరణలో గురువారం వృద్ధుల ఆరోగ్య సమస్యలపై ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 50 ఏళ్లకు పైబడిన మండలంలోని అన్ని గ్రామాలకు చెందినవారు హాజరుకావచ్చని తెలిపారు. బీపీ, షుగర్, నరాల బలహీనత, శారీరక బలహీనత, మానసిక రుగ్మతలు తదితర అంశాలకు సంబంధించి ప్రత్యేక వైద్యాన్ని ఈ శిబిరం ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. ఆధార్ కార్డులతో ఈ శిబిరంలో పాల్గొనవచ్చని తెలిపారు.

'ఇంటింటి సర్వేలో వివరాలు జాగ్రత్తగా తీసుకోవాలి'

నర్సాపూర్,ఆగస్టు 27: కొత్త ఓటర్ల నమోదుతో పాటు తొలగించే ఓటర్లపై బీఎల్‌వోలు ఇంటింటి సర్వేలో నిర్లక్ష్యం వహించవద్దని నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో బీఎల్‌వోలతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేసుకునేలా చూడటమే కాకుండా ఓటరు లిస్టులో ఉన్న వారిలో చనిపోయిన వారి పేర్లు, రెండుచోట్ల ఉన్నవారి పేర్లను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ఏఐఎస్ఎఫ్ రక్తదాన శిబిరం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 27 : అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 89వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ దత్తురెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ 88 సంవత్సరాలు పూర్తి చేసుకున్నామన్నారు. దేశంలోనే మొట్టమొదటిగా విద్యార్థి సంఘంగా ఆవిర్భవించి నేటి వరకు విద్యార్థుల సమస్యలపైనే కాకుండా సమాజిక సేవల్లోనూ ముందుంటున్నట్టు గుర్తు చేశారు. అనంతరం రక్తదాతలకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. అనిల్‌కుమార్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంకు ఇంచార్జి రాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహబూబ్‌ఖాన్. ఏఐఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విధి విధానాలు రూపొందించండి: కేవీపీఎస్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 27 : అంబేడ్కర్ అభయహస్తం కోసం విధివిధానాలు రూపొందించాలని కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు దళిత, గిరిజనకుల కోసం చేవేళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు దాన్ని అమలు చేయడంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నదన్నారు. కాలేజీ హాస్టల్ విద్యార్థులకు మెస్‌చార్జీలు రూ.2,500 పెంచాలని, కాస్మోటిక్ చార్జీలు, ప్యాకెట్ మనీ వెయ్యి రూపాయలు పెచుతూ జీవో జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 2న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, చంద్రశేఖర్, దత్తు, సోల్మన్‌రాజ్, అన్వేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.51 వేలు విరాళం

పుల్‌కల్, ఆగస్టు 27: చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి రూ.51వేల విరాళం అందజేశారు. గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్థులు మంగళవారం సంగారెడ్డిలోని భిక్షపతి నివాసానికి వెళ్లి విరాళం అందజేయాలని కోరడంతో ఆయన ఈ విరాళాన్ని అందజేశారు.

అసైన్డ్, అటవీ భూముల అక్క్రాంతంపై ఫిర్యాదు

జిన్నారం, ఆగస్టు 27: మండలంలోని కొడకంచి శివారులో అసైన్డ్, అటవీ భూముల అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మంగళవారం బీజేపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి కొడకంచి శివారులోని 283నుంచి 285 వరకు ఉన్న సర్వే నెంబరు భూముల్లో ఆక్రమణలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. 822 ఎకరాల విస్తీర్ణం గల సర్వే నెంబర్లలో అటవీ, అసైన్డ్ భూములు ఉండగా.. కొందరు ఈ భూములు ఆక్రమించారని, వాటిపై సర్వే జరిపి, అసైన్డ్, అటవీ భూములను రక్షించాలని ఫిర్యాదు చేసినట్లు జగన్‌రెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో కేజీబీవీ అకౌంటెంట్ మృతి



సుస్మిత(ఫైల్)

కంగ్టి, ఆగస్టు 27: కంగ్టి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న సుస్మిత అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మండలంలోని తడ్కల్ గ్రామానికి చెందిన సుస్మిత గత 11 సంవత్సరాలుగా కంగ్టి కేజీబీవీలో అకౌంటెంట్ పని చేస్తున్నారు. రెండేళ్లుగా క్యాన్సర్‌వ్యాధితో బాధపడుతున్న ఆమె మంగళవారం నారాయణఖేడ్ వైద్యశాలలో చికిత్సపొందుతూ మృతి చెందింది. ఆమెకు భర్త, కూతురు ఉన్నారు. అకౌంటెంట్ మృతిపట్ల కేజీబీవీ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

అర్హులందరికి సంక్షేమ ఫలాలు

వట్‌పల్లి, ఆగస్టు 27 :పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ వట్‌పల్లి మండల అధ్యక్షుడు ప్రతాప్ రమేష్‌జోషి అన్నారు. మండలంలో వివిధ గ్రామాలకు చెందిన45 మంది చికిత్స నిమిత్తం దరఖాస్తు చేసుకోగా వారికి సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సాయం మంజూరైంది. బాధితులందరికి మంగళవారం రూ. 11.30 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, దిగంబర్‌రావు, మాజీ ఎంపీపీ పత్రి విఠల్ ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా బ్యాంకర్లు సేవలందించాలి



ఖేడ్‌లో బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 27: రైతులకు ఇబ్బందులు కలుగకుండా సేవలందించాలని, బ్యాంకులలో దళారులను ప్రోత్సహించవద్దని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. మంగళవారం ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని బ్యాంకు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకర్లు దళారులు, నాయకులకు ప్రాధాన్యతనివ్వకుండా రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రుణమాఫీకి సంబంధించిన సమస్యలు వస్తే మొదట రైతులకు ప్రాధాన్యతనిచ్చాకే ఇతర ఖాతాదారుల సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతుల డిపాజిట్లు, బీమాలకు సంబంధించి అవి వారి మేలు కోసమేనని వివరించిన తర్వాత అంగీకరిస్తేనే చేసుకోవాలన్నారు. రైతు మిత్రలు ఎక్కువ కమీషన్ వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, వారు పద్ధతులు మార్చుకోకుంటే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ గోపాల్‌రెడ్డి, ఆర్డీవో అశోక చక్రవర్తి, డీసీసీబీ జీఎం శ్రీనివాస్, నాబార్డు జిల్లా అధికారి కృష్ణతేజ, వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్/మనూరు/నాగల్‌గిద్ద/పెద్దశంకరంపేట, ఆగస్టు 27: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. మంగళవారం నారాయణఖేడ్‌లో ఖేడ్, నిజాంపేట మండలాలకు సంబంధించి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అదే విధంగా మనూరు, నాగల్‌గిద్ద, పెద్దశంకరంపేట మండల కేంద్రాల్లో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను సైతం పంపిణీ చేశారు. కాగా నాగల్‌గిద్దలో 36 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం కరస్‌గుత్తి సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి అక్కడ రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని తప్పకుండానెరవేరుస్తుందని స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో అశోక చక్రవర్తి, తహసీల్దార్లు భాస్కర్, వెంకటస్వామి, రమాదేవి, గ్రేస్‌బాయ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



సంగారెడ్డి గణేష్‌నగర్‌లోని శ్రీమురళీకృష్ణ ఆలయంలో నిర్వహించిన సంగీతవిభావరి



గుమ్మడిదల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శ్రీకృష్ణ గోపికల వేషధారణలో విద్యార్థుల సందడి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 27: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా రెండో రోజు సంగారెడ్డి పట్టణంలోని గణేష్‌నగర్‌లోని శ్రీమురళీకృష్ణ ఆలయంలో మంగళవారం వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. భక్తులు శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మంజీరనగర్‌లోని శ్రీశారద సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో చిన్నారులతో నిర్వహించిన సంగీత విభావరి భక్తులను భక్తి భావంలో ముంచెత్తింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాండురంగం, మల్లారెడ్డి, శ్రీ శారద సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ శ్వేతజోషి శ్రీనివాస్, సంగీత విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

గుమ్మడిదల ప్రభుత్వ పాఠశాలలో..

గుమ్మడిదల, ఆగస్టు 27 : మండలంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుమ్మడిదల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులు శ్రీ కృష్ణ, గోపికల వేషధారణలో ఆటల పాటలతో అలరించారు. శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు ఉట్టికొట్టే కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.

వక్ఫ్ భూములకు వ్యతిరేక బిల్లును రద్దు చేయాలి



సంగారెడ్డిలో అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ముస్లింలు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 27 : వక్ఫ్ భూములకు వ్యతిరేకంగా ఉన్న అమెండ్‌మెంట్ బిల్లును రద్దు చేయాలని ముస్లిం మతపెద్దలు ఎంఏ హకీం డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో ముస్లింలు మంగళవారం సంతకాల సేకరణ నిర్వహించి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మతపెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ భూముల విషయంలో తీసుకువచ్చిన బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. ఈ బిల్లుతో ముస్లింల మనుగడకు ప్రమాదం పొంచి ఉందన్నారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో ఎండీ షకీల్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కవితకు బెయిల్‌పై బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వీధుల్లో బాణసంచా కాలుస్తూ స్వీట్లను పంచుకున్నారు. పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడం సంతోషంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు.



జహీరాబాద్‌లో స్వీట్లు పంచుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్/నారాయణఖేడ్/మునిపల్లి, ఆగస్టు 27: జహీరాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భవానీమందిర్ చౌరస్తా వద్ద టపాసులుపేల్చి, స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నామకిరణ్, బండిమోహన్,యాకూబ్,అబ్దుల్లా, రవికిరణ్, శివప్ప, రాకేష్, తులసీదాస్‌గుప్తా, సత్యం ముదిరాజ్, వెంకటేశంగుప్తా తదితరులు పాల్గొన్నారు. నారాయణఖేడ్‌లోని రాజీవ్ చౌక్ వద్ద బీఆర్ఎస్ బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రుబీనాబేగంనజీబ్, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు జగన్‌చారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. మునిపల్లిలో మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షి, బీఆర్ఎస్ నాయకులు పైతర సాయికుమార్, మంతూరి శశికుమార్, ఆనంద్ తదితరులు మాట్లాడుతూ.. చివరకు న్యాయమే గెలిచిందన్నారు.

మెదక్ జిల్లాలో..

మెదక్ మున్సిపాలిటీ/చిన్నశంకరంపేట, ఆగస్టు 27: ఎమ్మెల్సీ కవితపై తప్పుడు కేసులు నమోదు చేశారని మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ఆరోపించారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్ వద్ద సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు టపాసులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. సంబురాల్లో కౌన్సిలర్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, వంజరి జయరాజ్, ఆర్కె శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. చిన్నశంకరంపేటలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై విడుదల కావడంతో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. కవితకు లిక్కర్ కేసులో సంబంధం లేకున్నా అక్రమ కేసులు పెట్టారని ఆయన ఆరోపించారు.

ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాల్సిందే



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్య మిత్రలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 27 : రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆరోగ్య మిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు హిమగిరి ప్రసాద్ డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా మంగళవారం ఆరోగ్య మిత్రలు సంగారెడ్డిలోని జడ్పీ ఆఫీస్ ఆవరణలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద 16 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచాలని, ఉద్యోగులను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, విధి నిర్వహణలో మరణిస్తే రూ.50 లక్షల ఆర్థిక సాయం చేయాలని, అంతే కాకుండా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డులివ్వాలని, డీపీవో క్యాడర్ కల్పించాలని, జీవో నం.60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, షఫ్లింగ్ విధానం రద్దు చేయాలంటూ పలు డిమాండ్లు చేశారు. ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య మిత్రలు రాజు, ఎం.రాజు, గాయత్రీ, వినోద్, ఖైరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొర్వి కృష్ణస్వామి జయంతి



దుద్యాలలో మాట్లాడుతున్న రాష్ట్ర ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్

వట్‌పల్లి, ఆగస్టు 27 : అన్ని రంగాల్లో వెనకబడిన ముదిరాజుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైరన్ బొర్ర జ్ఞానేశ్వర్ అన్నారు. కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 132వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం వట్‌పల్లి చౌరస్తా వద్ద జెండాను ఎగురవేశారు. అనంతరం మండలంలోని దుద్యాల సర్వేశ్వర మఠం ఆస్థానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను బీసీ 'డి' నుంచి 'ఏ' గ్రూపులోకి తీసుకువచ్చేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. వైద్య, విద్యా పరంగా అండగా ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, భాగన్న, రాములు, గంగారాం తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ, బ్యాగ్‌లు పంపిణీ



విద్యార్థులకు స్టేషనరీ, బ్యాగులను పంపిణీ చేసిన అనంతరం యూత్ ఫర్ సేవా ప్రతినిధులు

కొండాపూర్, ఆగస్టు 27: గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను చేయూతనిచ్చేందుకు యూత్ ఫర్ సేవా పనిచేస్తుందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం గంగారం ఉన్నత పాఠశాలలో చదువుతున్న 153 విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్స్, డిక్షనరీలు, స్టేషనరీ కిట్లను సంస్థ సభ్యులు అందజేశారు. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కుటుంబాల్లో తల్లిదండ్రులు ఆర్థికంగా వెనుకబాటులో ఉంటారని అలాంటి వారికి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే ఉద్యోగులు సహాయం చేస్తే చదువులో మరింత రాణిస్తారని ఉద్దేశంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు సభ్యులు హరీశ్, సాయిగణేష్ వెల్లడించారు.

పేదలకు డబుల్ బెడ్రూంలను పంపిణీ చేయాలి

చేగుంట, ఆగస్టు 27: అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూంలు పంపిణీ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం చేగుంట తహసీల్దార్ నారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని 330 సర్వే నెంబర్‌లో గత ఎనిమిదేళ్ల క్రితం నిర్మించిన 108 డబల్ బెడ్రూం ఇళ్లను ఇంతవరకు నిరుపేదలకు పంపిణీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో నివసించే వలస కార్మికులు, నిరుపేదలు సరైన పని లేక, ఇంటి అద్దెలు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చొరవ తీసుకొని అర్హులైన నిరుపేదలకు డబల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని కోరారు. లేని పక్షంలో నిరుపేదల పక్షాన ఆందోళన చేపడుతామన్నారు.

ఆలయ వార్షికోత్సవానికి దుబ్బాక ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

చేగుంట , ఆగస్టు 27: మండల కేంద్రంలో శ్రీ మహంకాళి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 2 వరకు జరిగే కార్యక్రమాలకు హాజరు కావాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సంద్రుగు స్వామి, డిష్ రాజు ,సోమ సత్యనారాయణ, ల్యాబ్ రవి తదితరులు ఉన్నారు.